క్లుప్తంగా

విద్యుత్ బల్బు దినోత్సవం



మరికల్: మండల ఎలక్ట్రీషియన్ సంఘం ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ బల్బు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బల్బును కనుకొన్న థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. ఆయన బల్బు కనుక్కోవడం వల్లే నేడు సమాజం వెలుగులు చూస్తుందని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మల్లేష్, వెంకటేష్, శ్రీను, సూరి, రాఘువేద్ర, రవి, రాజు, చారి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

మరికల్: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ నాయకులు టంకర్ శ్రీను, శేఖర్, కొండప్ప అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ కొన్ని నెలల నుంచి పశువుల ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో పాడి రైతులు ప్రైవేట్ వెటర్నరీ మెడికల్ దుకాణాలను ఆశ్రయించి రూ.వేలు నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పశువుల వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు రైతులకు అందించాలని కోరారు.

29 నుంచి ఆధార్ కేంద్రం ప్రారంభం

మరికల్: మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 29 నుంచి తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ కార్డులు లేని వారు ఎవరైనా ఉంటే ప్రత్యేక ఆధార్ శిబిరంలో సంప్రదించాలని కోరారు. ఈ క్యాంపు 15 రోజుల పాటు ఉంటుందని, ఆధార్ కార్డులు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



ఊట్కూరు: పెద్దజట్రంలో జిల్లా స్థాయిలో అవార్డు పొందిన అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ, ఆశా వర్కర్ ప్రియాంకలకు శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్‌కుమార్, గౌరీ శంకర్, సోమేశ్వర్‌రెడ్డి, తిమ్మప్ప, అనిల్ ఉన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ



నారాయణపేట రూరల్: జిల్లా ఆస్పత్రిలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ, బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అబ్బాయిలకు సమానంగా అమ్మాయిలను చూడాలని, పురిటిలో ఆడబిడ్డను చంపడం మహాపాపమని, చట్టరీత్యా నేరస్తులవుతారని హెచ్చరించారు. పుట్టిన బిడ్డకు బర్త్ సర్టిఫికెట్లు వెంటనే తీసుకోవాలన్నారు. పిల్లల పేరుతో డబ్బులు జమ చేయాలని, 18 ఏళ్ల తర్వాత అవి వారి చదువు, పెళ్లిళ్లకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో నరేష్, విజయ్, ఏఎన్ఎం రేణుక, ఆశావర్కర్ కోకిల పాల్గొన్నారు.

విహారయాత్రకు వసతి గృహ విద్యార్థులు



అమరచింత: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహ విద్యార్థులు శనివారం విహారయాత్రకు బయలు దేరారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి నుశిత యాత్రకు బయలు దేరుతున్న బస్సుకు పూజలు నిర్వహించి యాత్ర ప్రారంభించారని అమరచింత ఎస్సీ వసతి గృహ వార్డెన్ బెనర్జీ తెలిపారు. జిల్లాలోని అన్ని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాలకు చెందిన బాలికలు, బాలురు విహార యాత్రకు వెళ్తున్న సందర్భంగా విద్యార్థులకు తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో వసతిగృహాల అధికారులు బెన ర్జీ, జీసీ రాజు, సత్యనారాయణ, ప్రవీణ్‌కుమా ర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై అక్రమ అద్దె వసూళ్లు

- మరికల్‌లో ప్రైవేట్ వ్యక్తుల దౌర్జన్యం
- పట్టించుకోని అధికారులు



బస్టాండ్ ఎదుట జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు

మరికల్: ప్రభుత్వ స్థలంలో తోపుడు బండ్లపై చిరు వ్యాపారం చేసుకునే వారి వద్ద కొందరు ప్రైవేట్ వ్యక్తులు దౌర్జన్యంగా స్థలం తమదంటూ అద్దె వసూళ్లు చేస్తున్న విషయం మరికల్‌లో వెలుగు చూసింది. మరికల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 1లో కొందరు చిరు వ్యాపారులు టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపారాలను సాగిస్తున్నారు. ఈ స్థలం తమదంటూ ఇక్కడి నుంచి వ్యాపారం తీసివేయాలి, లేదంటే నెలకు రూ.3 వేలు అద్దె ఇవ్వాలని భయపెడుతూ.. కొన్ని నెలల పాటు అద్దె వసుళ్లు చేశారు. అయితే తైబజార్ వారు చిరు వ్యాపారుల వద్ద నిత్యం రుసుం వసూలు చేయడానికి వెళ్లగా ఈ విషయం బయట పడింది. అలాగే జాతీయ రహదారి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారులతో నెలకు రూ.5 నుంచి 10 వేల లోపు అద్దెలు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దుకాణ యాజమానులకు అద్దె ఇవ్వడమే కాకుండా రోజు తైబజార్ కూడా చెల్లించాల్సి రావడంతో బతుకు భారమవుతుందని చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో అద్దెలు వసూలు చేసిన ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా.. ప్రభుత్వ స్థలంలో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు తైబజార్ చెల్లించిన తర్వాత ప్రైవేట్ వ్యక్తులకు అద్దె ఇవ్వొద్దని సూచించారు. అద్దె ఇస్తే చిరు వ్యాపారులను తొలగిస్తామన్నారు.

క్రికెట్‌లో విజేత బాపన్‌కుంటతండా



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న సుభాష్‌నాయక్

కోస్గి(మద్దూరు): మండల కేంద్రంలో 20 రోజులుగా నిర్వహించిన మద్దూరు మండల ఓపెన్ టూ ఆల్ టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ నెల 8న ప్రారంభించిన ఈ టోర్నమెంట్‌కు మద్దూరు, దౌల్తాబాద్, కోస్గి, దామరగిద్ద, కొత్తపల్లి, గుండుమాల్ తదితర మండలాల నుంచి 40టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో గుండుమాల్ మండలంలోని బాపన్‌కుంట తండా, మద్దూరులోని కాపుగేరి టీంలు తలపడ్డాయి. విజేతగా బాపన్‌కుంటతండా టీం నిలిచింది. మొదటి బహుమతిని కాంగ్రెస్ దేవులానాయక్ రూ.30 వేలు, రన్నరప్ టీంకు కాంగ్రెస్ నాయకుడు సుభాష్‌నాయక్ రూ.15 వేలు అందజేశారు. విజేతలకు ట్రోఫీలను జయప్రకాష్‌నాయక్ అందజేశారు. ఇక్కడ నుంచి అడిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని అకాంక్షించారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

ఊట్కూరులో గ్రామసభ



గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

ఊట్కూరు: మండల కేంద్రంలో శనివారం సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులు నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి సుమలత, ఉపసర్పంచ్ ఇబాదూర్ రహెమాన్, వార్డు సభ్యులు రఘువీర్, హేమలత, త్రివేణి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న రతంగపాండురెడ్డి

నారాయణపేట రూరల్: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగపాండురెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ స్కూల్‌లో పాలమూర్ ఉమ్మడి జిల్లా (విభాగ్) స్థాయి ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు మానసిక, ఆధ్యాత్మిక, ప్రామాణిక వికాసం, శారీరక దృఢత్వం పొందాలన్నారు. క్రీడల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎల్లప్ప, లక్ష్మయ్యగౌడ్, చంద్రశేఖర్, డాక్టర్ ప్రసాద్, హెచ్ఎం దత్తుచౌద్రి పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు



మాగనూర్‌లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

మాగనూర్: మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో, వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం పెరిగిపోయింది. వీధి కుక్కలే అనుకుని పక్కనుంచి వెళ్దామనుకుంటే, ఎక్కడ దాడి చేస్తాయోనని చిన్నారులు, పెద్దలు జంకుతున్నారు. కుక్కల గుంపు రోడ్లనే ఆవాసంగా మార్చుకుంటున్నాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుట్టల తవ్వకం నిలిపేయండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నార్లోనికుంట్ల సర్పంచ్ తదితరులు



గుట్టను తవ్వడానికి ఏర్పాటు చేసిన హిటాచీ

దేవరకద్ర: నార్లోనికుంట్ల, బస్యాపూర్ శివారులోని రెట్టపేట గట్టు ప్రాంతంలో జేసీబీలు, హిటాచీలను పెట్టి మట్టిని తవ్వి వందల ట్రిప్పులు అక్రమంగా అమ్ముకుంటున్నారని సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ నాగేశ్, మాజీ సర్పంచ్ రాఘవులు ఆరోపించారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు ఈ తవ్వకాల ను సాగిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే గుట్ట సగభాగం గుంతలతో నిండి పోయిందని పేర్కొన్నారు.

అయోధ్యకు నారాయణపేట కౌన్సిలర్లు

నారాయణపేట: స్థానిక మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అయోధ్య శ్రీరామచంద్ర దర్శనానికి బయలుదేరారు. అయోధ్యలో ఇటీవల ప్రారంభించిన భవ్య రామ మందిరాన్ని దర్శించి నారాయణపేట పట్టణానికి మంచి జరగాలని ప్రార్థించనున్నట్లు తెలిపారు. హిందువుల చిరకాల వాంఛ అయిన అయోధ్య రామ మందిరం నిర్మాణం జరగడం ఆనందదాయకమని, 1992లో ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీ మనోహర్ సారథ్యంలో నారాయణపేట నుంచి అయోధ్య వెళ్లిన వారిలో పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అమ్మపల్లి చిన్నారెడ్డి, కౌన్సిలర్లు జొన్నల అనితసుభాష్, నారాయణమ్మ వెంకటేష్, మేఘా శ్రీపాదరావు, బండి రాజేశ్వర్ శివరాంరెడ్డిలు పాల్గొన్నారు.

'మీసేవ' కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



హన్వాడలో వినియోగదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిష్ట్యనాయక్

హన్వాడ: మండలంలోని 'మీసేవా' కేంద్రాలను తహసీల్దార్ కిష్ట్యనాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చే అర్జిదారులకు కనీస వసతులైన తాగునీటితో పాటు 'మీసేవా' ధరల పట్టికను కనిపించేలా పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ధరల పట్టికలో ఉన్న రేటు ప్రకారమే రుసుం తీసుకోవాలని, సంబంధించిన రసీదులు ఇవ్వాలన్నారు. కుల, ఆదాయ, నివాసంతో పాటు వివిధ రకాల దరఖాస్తులను వెంటనే కార్యాలయానికి వచ్చేలా చూడాలన్నారు. మండల కేంద్రంతో పాటు టంకర, చిన్నదర్పల్లి, కొత్తపేటల్లోని మీసేవా కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన వినియోగదారులతో నేరుగా మాట్లాడారు. 'మీసేవ'లపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు కేంద్రాల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



చిన్నచింతకుంట: కురుమూర్తిలో గ్రామ పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, అప్పంపల్లి సింగిల్‌విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు విజ యసారథి రెడ్డి, జీజీపాల్, మహదేవన్‌గౌడ్,శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మరమ్మతు చేపట్టడంతో ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కులగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11కేవీ పాత సబ్‌స్టేషన్, టౌన్ 1 ఫీడర్‌ల మరమ్మతుల కోసం ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. దానివలన పట్టణంలోని పాతబస్టాండ్, దుర్గానగర్, మాలపేట, కమంతంపేట, గుర్రంతోట, మేకలపేట, తెలుగుపేట, ఉప్పరిపేట, మడ్డిగుంత, కాలమ్మపేట, గాంధీచౌక్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని బింగుదొడ్డి, జడదొడ్డి శివార్లలో వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సౌకర్యంకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం



దేవరకద్ర: పుట్టపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి కొకుంట్ల సర్పంచ్ స్వప్న, కిషన్‌రావు దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ పెద్దలు, దేవస్థాన కమిటీ వారికి నగదు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, యాదవరెడ్డి, అనంతరెడ్డి, కొండన్న, శే ఖర్, జానకి రాములు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నుంచి బహిష్కరణ

ఆత్మకూర్: సీపీఎం కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న శ్రీహరి, గోపాలకృష్ణను పార్టీ నుంచి బహిస్కరిస్తున్నామని సీపీఎం జిల్లాకార్యదర్శి జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీఎస్ గోపి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సదరు నాయకులు రెండేళ్లుగా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించినా ఫలితం లేక పోయిందన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తా



మక్తల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వనజ

మక్తల్: మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని, గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని మక్తల్ ఎంపీపీ వనజ అన్నారు. శనివారం మక్తల్ ఎంపీపీ చాంబర్‌లో ఎంపీటీసీలు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులనుంచి మంజూరు చేసేందుకు గ్రామాల్లో పనులు చేయటానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. యాక్షన్ ప్లాన్ వెంటనే తమకు పంపించాలని ఎంపీటీసీ సభ్యులను కోరారు. గతంలో పనులు చేసే వాటిని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, వైస్ఎంపీపీ రామేశ్వరి, ఎంపీడీఓ సద్గుణ, పీఆర్ ఏఈ లక్ష్మీనారాయణ, ఎంపిఓ రహిమాద్దీన్, ఎంపిటిసిలు గాళ్ల ఇందిర, బాల్‌రాంరెడ్డి, ఆశిరెడ్డి, పద్మమ్మ, సుజాత, తిమ్మప్ప, కతల్‌హుసేన్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి భూమిపూజ



చెక్ డ్యాం నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి(మద్దూరు): కొత్తపల్లి మండలంలోని లింగల్‌చేడ్ దగ్గర ఉన్న పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ తిరుపతిరెడ్డి భూమి పూజ చేశారు. రూ.8.40 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే ఈ చెక్‌డ్యాం 170 మీటర్ల పొడవు, 4.59 మిలియన్ ఫీట్ల నీటి ఆదా అవుతుందన్నారు. ఈ చెడ్‌డ్యాం ద్వారా సుమారు 380 ఎకరాలకు సాగునీరు అందుతుందని నీటి పారుదల శాఖ ఎస్ఈ చక్రధరం తెలిపారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని తిరుపతిరెడ్డి అధికారులకు సూచించారు. లింగల్‌చేడ్ నుంచి మద్దూరు, కాన్‌కుర్తి మీదుగా కర్ణాటకా రాష్ట్రంలోని యానగుండే వరకు డబుల్ రోడ్డు వస్తే మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటకా బీజాపూర్ హైవేకు దూర భారం తగ్గుతుందని ఈ రోడ్డును మంజూరు చేయించాలని తిరుపతిరెడ్డికి జిలా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి, మండల సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, షెక్ మీరాన్, హన్మిరెడ్డి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఎంపీటీసీ అనిత పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



అదవిసత్యరంలో ఇంటికి వెళ్లి తనిఖీ చేస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

మాగనూర్: గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు స్థానికంగా పనులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోందని ఎస్ఆర్పీ శ్రీనివాసులు అన్నారు. ఈ పథకంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ఏడాదిలో వంద రోజుల పని కల్పిస్తారని తెలిపారు. ఈ పథకంలో చేపట్టే పనులు, కూలీలకు చేసే చెల్లింపులు పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం ఉపాధి పనులపై ప్రతి ఏడాది సామాజిక తనిఖీ నిర్వహిస్తుందన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎన్ని పనులు చేపట్టారో వాటిని క్షేత్రస్థాయిలో తనిఖీ బృందాలు పరిశీలిస్తున్నాయన్నారు. శనివారం మండలంలోని వర్కూర్, కొత్తపల్లి, వడ్వాట్, ఓబ్లాపూర్, మందిపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో పనులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్పీలు నాగయ్య, ఆంజనేయులు, ప్రవీణ్, బిందు, పవని, రామ్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందించేందుకే ప్రతిభ పరీక్షలు



శ్రీసాయి స్కూల్‌లో ట్యాలెంట్ టెస్ట్

నారాయణపేట రూరల్: విద్యార్థుల్లో ప్రతిభ పరీక్షలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ బాలప్ప అన్నారు. పట్టణంలోని శ్రీసాయి స్కూల్‌లో సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 31వ సీవీ రామన్ ఒలంపియాడ్ ట్యాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు 85మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పాఠశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు పరీక్ష రాసి రాష్ట్ర స్థాయి బహుమతులు పొందుతున్నారని, హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో సన్మానం పొందారని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు నర్సింహ, అమీనా, సురేందర్, రాధాకిషన్ పాల్గొన్నారు.

లాప్రొస్కోపి విధానంలో తొలి అపెండెక్స్ ఆపరేషన్



జిల్లా ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన వైద్యులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలోని వైద్యబృందం తొలిసారిగా లాప్రోస్కోపి విధానంలో ఓ యువకుడికి అపెండెక్స్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. ధన్వాడ మండలం కొత్తపల్లికి చెందిన 24ఏళ్ల యువకుడు అయ్యప్ప కడుపులో తీవ్ర నొప్పితో శనివారం జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. వెంటనే వైద్యులు పరీక్షించగా అపెండెక్స్‌తో సతమతమవుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన లాప్రోస్కోపి మిషన్ సహాయంతో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. వైద్యబృందం డాక్టర్ నీలవర్ణ, డాక్టర్ పావని, డాక్టర్ శివానంద్, సరోజ, విజయలక్ష్మి, తిరుపతమ్మ, దశరథ్ పాల్గొన్నారు.

'మాతృవందన యోజన' మహిళలకు వరం

నారాయణపేట: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అమలు చేస్తున్న మాతృవందన యోజన మహిళలకు వరమని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మిశ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అంగన్‌వాడీ ఏఎంఎంలతో గర్భిణులు పేర్లు నమోదు చేసుకుంటే విడతగా రూ.వెయ్యి, 6 నెలలు తర్వాత రూ.2 వేలు, ప్రసవం తర్వాత రూ.3 వేలు వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అలాగే యథావిధిగా ఎప్పటిలాగే అన్ని చికిత్సలు, మందులు ఉచితంగా అందుతాయన్నారు. దశాబ్దాల కాలంగా గత ప్రభుత్వాలు అనిచిపెట్టిన మహిళ బిల్లు తీసుకొచ్చి మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కిందన్నారు. ట్రిబుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించారని కొనియాడారు. ముద్ర యోజనలో 68 శాతం రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించారన్నారు. అంతే కాకుండా మహిళల కష్టాలు తీర్చేందుకు ఉజ్వల పథకంలో లక్షలాది ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన మహిళలకు ఎన్నో అభివృద్ధి పనులను చేశారన్నారు. అలాంటి ప్రభుత్వం మరోసారి ఏర్పాటు చేసేందుకు మహిళలంతా ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని కోరారు.